క్లుప్తంగా

ఆర్థిక సాయం



కొత్త రజినికి ఆర్థిక సాయం అందజేస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: రోడ్డు వెడల్పులో ఇంటిని కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ మహిళకు బోడుప్పల్ 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి ఆర్థిక సహాయం చేశారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసే కొత్త రజిని అంబేడ్కర్ చౌరస్తా వద్ద రోడ్డు వెడల్పులో స్థలాన్ని కోల్పోయింది. దీంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండటంతో కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి ఆదివారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు.

నియామకం



పొన్నాల రాజు

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా మల్లాపూర్ దుర్గానగర్‌కు చెందిన పొన్నాల రాజు నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం పొన్నాల రాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. బీ బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు లంబూ శ్రీనువాస్‌గౌడ్ ఆదివారం ఆయనను అభినందించారు.

వడ్డీ రేట్లు పెరిగాయి.. డిపాజిట్లు చేసుకోండి



సాక్షి, సిటీబ్యూరో: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మల్కాజిగిరి శాఖ బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం కసా క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ క్రాంతి కిరణ్ మాట్లాడుతూ ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లు పెరిగిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హౌసింగ్ రుణాలపై ప్రాసెసింగ్ చార్జీలు మినహాయింపు తదితర సందేహాలపై బ్యాంకు అధికారులను సంప్రదించవచ్చన్నారు.

ఆత్మీయ సత్కారం



మల్లేష్ యాదవ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: కొమురవెల్లి మల్లన్న దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా నాచారం ప్రాంతానికి చెందిన ఎర్రగోళ్ల మల్లేష్ యాదవ్ నియమితులైన సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం యాదవుల ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నాచారం భద్ర గ్రాండ్ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీఎల్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొమురవెల్లి మల్లన్న దేవస్థానంలో మన ప్రాంతానికి ప్రాతినిధ్యం దక్కడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజెన్ శేఖర్, వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవి, విఠల్ యాదవ్, అల్లాడి కృష్ణ యాదవ్, బాలయ్య యాదవ్, సర్వ సత్తయ్య, శ్రీను, భిక్షపతి యాదవ్, శ్రీశైలం యాదవ్, సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు సీఎం రిలీఫ్ చెక్కు అందజేత

బోడుప్పల్: 26వ డివిజన్ వీరారెడ్డి కాలనీకి చెందిన దత్తత్రి అనే వ్యక్తి అనారోగ్యానికి గురికాగా ఆయనకు మంజూరైన సీఎం రిలీఫ్ చెక్కు రూ.లక్షను వారి కుటుంబానికి ఆదివారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 26వ డివిజన్ ఇన్‌చార్జి రాసాల మహేష్‌యాదవ్, పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, పులకండ్ల కీర్తన్‌రెడ్డి, మోతే రాజు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మంద సంజీవ్‌రెడ్డి

రూ.100 కోట్లు.. అభివృద్ధిలో జోరు..

- మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు..
- రానున్న రెండేళ్లలో మరిన్ని అభివృద్ధి పనులు..
- 'సాక్షి'తో.. బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి

'సాక్షి' ఇంటర్వ్యూ



సామల బుచ్చిరెడ్డి, బోడుప్పల్ మేయర్

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో గడిచిన మూడేళ్లలో రూ.100 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్య నిర్వహణతో పాటు ఇతర పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా అధికారులు, పాలకవర్గం సమన్వయంతో రానున్న రెండేళ్లలో మరింత అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డితో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ..

– బోడుప్పల్

సాక్షి: నగర ప్రజలకు ఎలాంటి మౌలిక వసతులు కల్పిస్తున్నారు?

మేయర్: అన్ని డివిజన్లలో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించి తాగునీరు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పాటు పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.

సాక్షి: ఇప్పటి వరకు ఎన్ని నిధులు కేటాయించారు. ఏఏ పనులు చేపట్టారు?

మేయర్: గడిచిన మూడేళ్లలో మౌలిక వసతుల కల్పనకు రూ.100 కోట్లు కేటాయించాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.34.31 కోట్లు, రా చెరువు నాలా కోసం రూ.12.75 కోట్లు హరిత హారం కోసం రూ.11.54 కోట్లు, సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీ నిర్వహణ పనులకు రూ.8.56 కోట్లు, సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌కు రూ.7 కోట్లు, ప్రహరీల నిర్మాణం కోసం రూ.6.84 కోట్లు, స్వచ్ఛ ఆటోల కోసం రూ.2.93 కోట్లు, ట్రీ పార్కుల అభివృద్ధి కోసం రూ.2 కోట్లు, సీసీ కెమెరాలకు రూ.1.50 కోట్లు, ఇతర సౌకర్యాల కోసం రూ.12.57 కోట్లు కేటాయించాం.

సాక్షి: రానున్న రెండేళ్లలో ఏ పనులు చేపడతారు?

మేయర్: సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. మార్చి నెలలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ప్రధాన రహదారులన్నీ వేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అలాగే అంబేడ్కర్ విగ్రహం నుంచి చిలుకానగర్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టి బీటీ రోడ్డు వేయనున్నాం. రా చెరువు కింద మిగిలిపోయిన నాలా పనులకు నిధులు కేటాయించి పూర్తి చేస్తాం.

సాక్షి: గడిచిన మూడేళ్లలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదనే ఆరోపణలున్నాయి?

మేయర్: అభివృద్ధి జరగలేదనడం వాస్తవం కాదు. గడిచిన మూడేళ్లలో అన్ని డివిజన్లకు సమానంగా నిధులు కేటాయించి తొలుత అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లకు, తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇచ్చాం. ఈక్రమంలో ప్రధాన రహదారులు వేయడంలో జాప్యం జరిగింది. రానున్న బడ్జెట్ సమావేశాల్లో తీర్మానం చేసి ప్రధాన రహదారులు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

సాక్షి: హరిత హారానికి ఎన్ని నిధులు కేటాయిస్తున్నారు?

మేయర్: ఇప్పటి వరకు హరిత హారం కోసం రూ.11.54 కోట్ల నిధులు కేటాయించాం. రానున్న రోజుల్లో బోడుప్పల్ హరిత వనంగా మారనుంది. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను పెడుతున్నాం.

సాక్షి: తాగునీటికి ఎలాంటి ప్రాధాన్యం ఇస్తున్నారు?

మేయర్: మిషన్ భగీరథ పథకం కింద నగర పాలక సంస్థ పరిధిలో అన్ని కాలనీలకు తాగునీరు ఇచ్చే ఉద్దేశ్యంతో ముందుకు వెళ్తున్నాం. ఇప్పటికే 80 శాతం కాలనీలకు రోజు విడిచి రోజు తాగునీరు ఇస్తున్నాం. మిగతా కాలనీలకు ఇచ్చేందుకు వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఆ పనులు పూర్తి కాగానే అన్ని కాలనీలకు రోజు విడిచి రోజు తాగునీటిని సరఫరా చేస్తాం. రానున్న రోజుల్లో ఎక్కడా నీటికి ఇబ్బందులు ఉండకుండా ప్రణాళికలు రూపొందించాం.

ఘనంగా ముగిసిన యాప్రాల్ ఉర్సు ఉత్సవాలు

అల్వాల్: ఫాజిల్ అఫ్జల్ వలీ చిష్తి, షరీఫ్ సాబెర్‌వలి చిష్తి అప్పగార్ల ఆరాధన ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం రాత్రి గంధం ఊరేగింపు జరిగింది. ఆదివారం ఉదయం ఖురాన్ గ్రంథపఠన ఖత్మఖురాన్ (సమస్త ఆరాధన) ఖవ్వాలి కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి. ముఖ్య అతిథిగా సిద్దిపేట పీఠాధిపతి హకీం షరీఫ్ చిష్తి హాజరై భక్తులకు ప్రవచనాలు వినిపించారు. అందరూ భక్తిశ్రద్ధలతో మంచిగా జీవించాలన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డితో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలు, చుట్టుపక్కల జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని యాప్రాల్ చిష్తియ భక్త మండలి ట్రస్టు సభ్యులు తెలిపారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి

ఎమ్మెల్యేకు గద్దర్ వినతి



ఎమ్మెల్యే మైనంపల్లితో ప్రజాగాయకుడు గద్దర్

అల్వాల్: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును ప్రజాగాయకుడు గద్దర్ ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సుభాష్‌నగర్‌లోని అమరుల స్మారక స్తూపం వద్ద కమిటీ హాల్ నిర్మాణం చేయాలని, మహోబోధి విద్యాలయంలో జూనియర్ కళాశాలకు కృషి చేయాలని, యాదమ్మనగర్ వద్ద నివసిస్తున్న నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం తరఫున రూ.3 లక్షల సహాయం పథకం అందేలా చూడాలని ఎమ్మెల్యేకు గద్దర్ వినతి పత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు గద్దర్ తెలిపారు.

మదర్సా విద్యార్థులకు అండగా ఉంటా..

మల్లాపూర్: హఫీజ్ ఏ ఖురాన్ అభ్యసించిన (మదర్సా) విద్యార్థులకు అండగా ఉంటానని మధుర చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారం మదర్సా సుఫతుల్ ముస్లిమీన్ 11వ స్నాతకోత్సవ జల్సా దస్తర్ బండి కార్యక్రమానికి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ అబ్దుల్‌రషీద్, నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మేడల మల్లికార్జున్‌గౌడ్, ప్రభాకర్, గ్యార కిరణ్, సాయి, రాకేష్, యూసఫ్, ఇద్రిస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి

పటేల్‌కుంట చెరువుపై నిర్లక్ష్యం ఎందుకు..?



నాచారంలో జోడో యాత్రలో పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: నాచారం పటేల్‌కుంట చెరువు కాలుష్య కాసారంగా మారిందని ఉప్పల్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీఎస్.ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జోడో యాత్రలో భాగంగా నాచారం ఎర్రకుంట కాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీ, గాంధీనగర్, కార్తీకేయనగర్, కాలనీలో యాత్ర చేపట్టారు. ముఖ్య అతిథిగా మందముల పరమేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. చెరువు కాలుష్యంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎండీ తోఫిక్, మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అగిరెడ్డి కృష్ణ ముదిరాజ్, శేఖర్‌గౌడ్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

అధికారం ఆమెది.. పెత్తనం పెనివిటిది!

సర్పంచ్ సీట్లో ఆమె భర్త హల్‌చల్

మేడ్చల్: అధికార దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసిన సర్పంచ్ ఆమె హైకోర్టు ఆదేశాలతో తిరిగి ఆరు నెలల తర్వాత సర్పంచ్ పదవి పొందినా అధికార దుర్వినియోగం మాత్రం ఆగడం లేదు. మండలంలోని ఎల్లంపేట్ గ్రామ సర్పంచ్ వెన్నెల తీరిది. గ్రామంలో సర్పంచ్ వెన్నెల అయినప్పటికీ పెత్తనం ఆమె భర్త రామకృష్ణుడు సాగిస్తున్నాడు. సాధారణంగా మహిళలు ప్రజాప్రతినిధులు ఉన్న చోట వారి భర్తో.. కుమారుడో.. తెర వెనుక ఉండి అన్ని పనులు చక్కబెడతారు. రామకృష్ణుడు మాత్రం తన భార్యకు ఉన్న అధికారంను తానే తీసుకుని పూర్తిగా అధికార దుర్వినియోగం చేస్తున్నాడు. గతంలో గ్రామ కంఠం భూములను ప్లాట్లుగా చేసి సర్పంచ్ సంతకాలతో సర్టిఫికెట్లు జారీ చేసి విచారణలో సస్పెండ్ అయిన ఘటన విధితమే. తాజాగా ఆయన గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏకంగా సర్పంచ్ సీట్లోనే కూర్చుని అన్నీ తానై నడిపిస్తున్నాడు. సన్మానాలు చేసుకుంటూ తానే సర్పంచ్‌గా వ్యవహరిస్తున్న ఫోటోలను గ్రామానికి చెందిన యువకుడు ఫోన్‌లో చిత్రీకరించాడు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.

ప్లేస్‌మెంట్ డ్రైవ్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. బహుళ జాతీయ సంస్థ జోహో ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా నాలుగు దశల్లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని, అందులో కళాశాలకు చెందిన వారే ఇద్దరు విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన కళాశాల విద్యార్థులను కళాశాల చైర్మన్ నర్సింహా రెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌బాబు తదితరులు అభినందించారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోండి

ఘట్‌కేసర్: ముఖ్యమంత్రి సహాయ నిధిని పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందిన ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన ఇద్దరికి మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్‌తో కలిసి ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంత్రి అందజేశారు. పన్నెండో వార్డుకు చెందిన రాజేశ్‌కు రూ.1.25 లక్షలు, శ్రావణికి రూ.2.50 లక్షలు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరయ్యాయి. కార్యక్రమంలో జంగయ్య యాదవ్, లబ్ధిదారులు ఉన్నారు.

చౌదరిగూడలో...

చౌదరిగూడ వెంకటాద్రిటౌన్‌షిప్‌కు చెందిన సోమాచారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.23,500 చెక్కును సర్పంచ్ రమాదేవి, మాజీ సర్పంచ్ రాములుగౌడ్, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు మంగతో కలిసి ఆదివారం అందజేశారు.

'మన వారికే ఓటు వేసుకుంటే రాజ్యాధికారం మనదే..'

ఘట్‌కేసర్: మన ఓటు మన వారికే వేసుకుంటే రాజ్యాధికారం మనకే దక్కుతుందని ఎస్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బిక్కునాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్‌కు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దాసు, నర్సింహ, బాలయ్య, రాములు, రాజేశ్, నర్సింగ్‌రావు, నవీన్‌కుమార్, అంజయ్య, కష్ణ, వెంకటేశ్వరరావు, రూపేశ్, గణేశ్, వినోద్, భరత్ పాల్గొన్నారు.

సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం

బోడుప్పల్: తమ ప్లాట్‌ల సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని వక్ఫ్ బోర్డు బాధితుల జేఏసీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆర్ఎన్ఎస్ కాలనీలో చేపట్టిన దీక్షలో ఆదివారం వారు మాట్లాడుతూ బోడుప్పల్‌లో ఇళ్లు కట్టుకుని దశాబ్దాల నుంచి 7వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. భూములు కొనేటప్పుడు ఎలాంటి లిటిగేషన్ లేదని ప్రభుత్వమే క్లియరెన్స్ ఇచ్చిందని, ఈసీలు తీస్తే కూడా నిషేదిత జాబితాలో ఈ భూములు లేవని అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం జేఏసీ నాయకులు మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. దీక్షల్లో కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ, కాలనీ అధ్యక్షుడు ప్రహ్లాదరెడ్డి, నర్సింహారెడ్డి, ధనంజయ రావు, డాక్టర్ స్మిత, హరిత, నాగరాణి, సూర్యకాంత్, రామకృష్ణ తదితరులున్నారు.



మంత్రి జగదీశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

సేవాలాల్ మార్గం స్ఫూర్తిదాయకం



సేవాలాల్ జయంతి వేడుకల్లో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిరవిగౌడ్

బోడుప్పల్: సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకుని బంజారా కులస్తులు ముందుకు సాగాలని బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిరవిగౌడ్ అన్నారు. చెంగిచర్ల 2వ డివిజన్‌లో ఆదివారం గోర్ బంజారా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లంబాడీలు, బంజారాల పరువు ప్రతిష్టల గురించి, ఆయా జాతుల సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు సేవాలాల్ మహరాజ్ ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తూ గిరిజనుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భూక్యా సుమన్ నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త రవిగౌడ్, సంఘం ప్రతినిధులు జి.దశరథ్, రవీందర్‌నాయక్, ధర్మనాయక్, మంజిలాల్ నాయక్, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాల అభివృద్ధికి కృషి

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్న టైప్ రైటింగ్ ఇనిస్టిట్యూట్స్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బోయినపల్లిలో ఆదివారం జరిగిన తెలంగాణ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ అండ్ కంప్యూటర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్స్ ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో పలువురు మాట్లాడుతూ సాంకేతిక విద్యాశాఖ అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించారు. తమిళనాడు తరహా విధానాన్ని మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని, నూతనంగా ప్రవేశపెట్టిన కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) కు సంబంధించిన శిక్షణ అనుమతులు, దరఖాస్తులు అన్నీ తమ ద్వారానే కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.



యువకుడి అదృశ్యం



రాపోలు సాయి కుమార్ (ఫైల్)

మేడిపల్లి: యువకుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చెంగిచర్ల గ్రామం గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న రాపోలు సాయికుమార్(24) చర్లపల్లిలోని ఓ చాక్లెట్ కంపెనీలో పనిచేస్తుంటాడు. ఈ నెల 24న ఉదయం 5.30 గంటలకు అతడు పనిచేసే కంపెనీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ సందీప్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాచారం వెస్లీ హైస్కూల్ పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

మల్లాపూర్: నాచారం వెస్లీ కో ఎడ్యుకేషన్ హైస్కూల్ 1997–98 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నాచారం చంద్ర గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. ఉపాధ్యాయులు స్వామిదాస్, రామప్ప, రంగాచారి, ఇందిరా, సరోజినీదేవీలను సత్కరించారు. పాఠశాలలో చేసిన అల్లరిని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు సూర్ల రాజేష్, మక్తాల శేఖర్‌గౌడ్, విజయ్, మాధవి, రాంచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సఫిల్‌గూడ రైల్వే గేటు తెరిపించండి



శ్రవణ్‌కు వినతిపత్రం అందజేసిన కాలనీవాసులు

మల్కాజిగిరి: సఫిల్‌గూడ రైల్వే గేటును తెరిపించాలని కాలనీవాసులు మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌కు వినతిపత్రం అందజేశారు. బలరాంనగర్, దేవీనగర్ కాలనీవాసులు, సఫిల్‌గూడ ఎన్టీఆర్ విగ్రహం నుంచి గేట్ వరకు ఉన్న వ్యాపార సముదాయల నిర్వాహకులతో కలిసి ఆదివారం ఆయన గేట్ వద్ద పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవీనగర్, సీతారాంనగర్, బలరాంనగర్ కాలనీవాసులకు సికింద్రాబాద్ వైపు వెళ్లడానికి సఫిల్‌గూడ మార్గం గతంలో ఉండేదన్నారు. రైల్వే గేటు మూయడంతో వారికి దూరం పెరగడమే కాకుండా ఆనంద్‌బాగ్ వైపు ఉన్న మార్గంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిందన్నారు. రైల్వే అధికారులతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలి

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

మల్లాపూర్: కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించి ప్రపంచంలోనే బలమైన శక్తిగా ఎదిగిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. నాచారం ఓల్డ్ విలేజ్‌లో శక్తికేంద్రం ఇన్‌చార్జి ఎల్లగోని అభిషేక్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రజాగోస- బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌ను శనివారం రాత్రి నిర్వహించారు. సమావేశానికి ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హాజరై మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలని ప్రజలను కోరారు. మళ్లీ రాష్ట్రంలో బీజేపీ సర్కార్ వస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మల్కా ప్రకాష్, పద్మారెడ్డి, అనితారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, దయాగౌడ్, నవీన్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు వెంకటేష్, సాయిగౌడ్, మహేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నాచారం ఓల్డ్ విలేజ్‌లో మాట్లాడుతున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే..

మల్కాజిగిరి: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ మహిళా మోర్చా విభాగం అధ్యక్షురాలు గీతామూర్తి అన్నారు. మల్కాజిగిరి డివిజన్ ఆనంద్‌బాగ్‌లో స్ట్రీట్ కార్నర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 8 ఏళ్ల కేసీఆర్ పాలనలో బంగారు తెలంగాణ చేయడంలో విఫలం అయ్యారని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చాడని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్రవణ్, నాయకులు రామక్రిష్ణ, రుత్విక్, సదానంద్‌గౌడ్, శ్రీనివాస్, నవీన్ తదితరులు ఉన్నారు.



ఆనంద్‌బాగ్‌లో మాట్లాడుతున్న గీతామూర్తి